క్లుప్తంగా

ముళ్ల చెట్లను తొలగించండి



బైపాస్ సర్వీస్ రోడ్డులో ఉన్న ముళ్ల చెట్లు

దెందులూరు: బైపాస్ సర్వీస్ రోడ్డు పక్కన దారి కనపడకుండా మూసివేసిన ముళ్ల చెట్లను తొలగించాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు. జాతీయ రహదారిపై సీతంపేట నుంచి ఆశ్రమం వరకు బైపాస్ రోడ్డు కిరువైపులా సర్వీస్ రోడ్డులో ముళ్ల చెట్లు దారి కనపడకుండా ఉన్నాయి. ఈ ముళ్ల చెట్లు వల్ల అనేక సార్లు ప్రమాదాలు జరిగిన సంఘటన కూడా లేకపోలేదు. అయితే సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి సీతంపేట నుంచి ఆశ్రమం వైద్యశాల వరకు రెండు వైపులా ఉన్న ముళ్ల చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా పాటెమ్మ పేరంటాలు తల్లి జాతర



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

దెందులూరు: మండలంలోని చల్లచింతలపూడిలోని పాటెమ్మ పేరంటాలుతల్లి జాతర మహోత్సవాలు కనుల పండుగ జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారికి ఆలయ అర్చకులు వివిధ రకాల పుష్పాలతో విశిష్ట అలంకరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ యలమర్తి శ్రీనివాసరావు, పెరుగ్గూడెం గ్రామ మాజీ సర్పంచ్ యలమర్తి హేమలత దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

స్వామి వారి పాదాలు తాకిన సూర్యకిరణాలు



వేంకటేశ్వర స్వామి పాదాలను తాకుతున్న కిరణాలు

భీమడోలు: గుండుగొలనులోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారిని మంగళవారం సాయంత్రం సూర్యకిరణాలు తాకాయి. సూర్య భగవానిని నుంచి ప్రసరించే కిరణాలు స్వామి వారి పాదాలను తాకాయి. దేవదాయ ధర్మదాయశాఖ పరిధిలోని కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి వారి మహత్యంగా భక్తులు భావిస్తూ దర్శించుకున్నారు. ఈ కనుల వేడుకగా జరిగిన ఈ కార్యక్రమాన్ని భక్తులు తిలకించారు. పూజారి మంగపతి ఆచార్యులు, ఆలయ నిర్వాహకులు వగ్వాల మీనాకుమారి, అచ్యుతరామారావు,పెద్దలు దర్శించుకున్నారు.

పారదర్శకంగా రుణప్రణాళిక తయారుచేయాలి



ఎన్యూమరేటర్లకు సూచనలిస్తున్న ఏపీఎం

గణపవరం: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థాగత విభాగం 2025 సంవత్సరానికి రుణప్రణాళిక తయారీపై ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సంఘ సభ్యుల జీవనోపాదులు ఏర్పాటు చేసుకొనుటకు, కుటుంబ అవసరాల కొరకు కావాల్సిన రుణ ప్రణాళిక తయారు చేయుటకు గణపవరం మండలంలో 228 ఎన్యూమరేటర్‌లను ఎంపిక చేశామని తెలిపారు. ఒక్కో ఎన్యూమరేటర్ 5 లేక 6 సంఘాల సభ్యులకు కావలసిన జీవనోపాధులు, కుటుంబ అవసరాలకు కావలసిన అవసరాలను గుర్తించాలన్నారు. ఈకార్యక్రమంలో సీసీలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నీటి తొట్టెలతో పశువులకు తీరనున్న దాహార్తి



పోలసానిపల్లిలో పశువుల నీటి తొట్టెలకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

భీమడోలు: వేసవిలో పశువులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా నీటి తొట్టెలు ఏర్పాటు చేస్తున్నామని పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా పోలసానిపల్లి గ్రామంలోని బీసీ, ఎస్సీ కాలనీల్లో నిర్మించనున్న నీటి తొట్టెలకు మంగళవారం ఆమె శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో పశువులకు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం నీటి తొట్టెలను నిర్మిస్తుందన్నారు. తద్వారా పశువులకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి యు.జయరామకృష్ణ, పెద్దలు ఉండి పెద్దిరాజు, క్షేత్ర సహాయకుడు నాగరాజు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈసారీ కందిపప్పు కట్

- పూర్తిగా ఎగ్గొడతారేమోనని లబ్ధిదారుల్లో ఆందోళన
- ఉగాది, రంజాన్ పండుగ నెలలో సైతం ఇవ్వకపోవడంపై కార్డుదారుల ఆగ్రహం



దెందులూరు: కూటమి ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా ఇచ్చే కందిపప్పును కట్ చేశారు. రెండు నెలలుగా దెందులూరు నియోజకవర్గంలో కందిపప్పు ఇవ్వటం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తోఫా ఇస్తాం... సంక్రాంతి కానుకలు ఇస్తామని చెప్పినచోట చెప్పకుండా చెప్పినవి చెప్పకుండా ఇష్టం వచ్చినట్టు ప్రచారం చేశారు. తీరా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సూపర్ సిక్స్ హామీలతో పాటు కందిపప్పును కూడా ఇవ్వకపోవడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిబ్రవరి, మార్చి నెల పూర్తిగా ఇవ్వలేదు ఈ నెలలో కూడా గోదాములోకి ఇంకా సరుకు రాక పోవడంతో ఈ నెల కూడా ఇస్తారా లేదా అన్న అనుమానం కలుగుతోందని పలువురు మహిళలు వాపోతున్నారు. మార్చి నెలలో వచ్చిన ఉగాది రంజాన్ పండుగలకు కందిపప్పు కలగానే మిగిలింది. కందిపప్పు కూడా ఇవ్వలేకపోతే నాయకులు పెద్దలు ప్రజలకు చేసేది ఏముంటుంది ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్నారు. సామాన్య మధ్యతరగతి ప్రజలు రేషన్ షాపుల్లో ఇచ్చే కందిపప్పు కోసం సాధారణంగా ఎన్నో అసలు పెట్టుకుని ఎదురు చూస్తుంటారు. బయటి మార్కెట్లో పేదలు కంది పప్పు కొనలేక ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో పండుగ నెలలో పప్పన్నం తీరని కలగానే మిగిలింది. కూటమి ప్రభుత్వం ఇస్తుందో ఇవ్వదు తెలియదు కందిపప్పు గోదాములకు వస్తుందో రాదో తెలియదు నాయకులు చెప్పే మాటలకు చేసే వాగ్దానాలను గ్రామాల్లో జరిగే పనులకు పొంతన లేకుండా పోతుందని వృద్ధులు, మహిళలు ఎద్దేవా చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వస్తుంది మీ కష్టాలు తీరిపోతాయని మూడు పార్టీల నాయకులు ఇచ్చిన హామీలు నెరవేరకపోగా ప్రశ్నించే నాయకుడు ఒక్కడు కూడా మూడు పార్టీల్లో కనపడకపోతే ఎలాగని ప్రజల సంగతి ఏమిటని ఇచ్చిన హామీలు చేసిన వాగ్దానాలు కేవలం కోట్లు కోసమే అన్నది క్రమేపి తమకు అర్థమవుతుందని నియోజవర్గంలో గ్రామ శివారు ప్రాంతాల్లో ప్రజలు అంటున్నారు.

నియోజకవర్గం వారీగా కార్డుదారులు

దెందులూరు	21600 రేషన్‌కార్డులు
పెదపాడు	21300 రేషన్ కార్డులు
పెదవేగి	29,431 రేషన్ కార్డులు
ఏలూరు రూరల్	21,300 రేషన్ కార్డులు

వారం రోజుల్లో ఇవ్వకపోతే నిరసనలు



వారం రోజుల్లో కందిపప్పు మూడు నెలలది ఇవ్వాల్సిందే. సూపర్ సిక్స్ హామీలను అడగటం లేదు. తినటానికి కందిపప్పు కూడా ఇవ్వాలన్న మనసు లేకపోవడం దుర్మార్గం. పేదల ప్రభుత్వం అంటే ఇదేనా పేదలకు అండగా ఉంటానన్నారు ఇలాగేనా. కందిపప్పును కూడా ఎగ్గొడితే ఊరుకోబోమని న్యాయపోరాటం చేస్తామన్నారు.

– కట్టా ఏసుబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి

దరఖాస్తుదారులకు ముఖాముఖి

దెందులూరు: దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు స్వయం ఉపాధి రుణాలు మంజూరు కోసం ఇంటర్వ్యూలు జరుగుతాయని దెందులూరు ఎంపీడీవో కే శ్రీదేవి అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ దెందులూరు, దోసపాడు, కొవ్వలి, పోతునూరు, సానిగూడెం గ్రామాల్లో రుణాలు మంజూరు కోసం దరఖాస్తు చేసినవారు ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు, అప్లికేషన్, బ్యాంకు బుక్‌తో ఇంటర్వ్యూకు రావాలన్నారు. మిగిలిన అన్ని గ్రామాల్లో దరఖాస్తు చేసిన వారు గురువారం ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఎంపీడీవో సూచించారు.

నేడు మహా అన్న సమారాధన

దెందులూరు: మండలంలోని కొవ్వలిలోని అంకమ్మ తల్లి సంబరాలు ముగింపు సందర్భంగా బుధవారం మహా అన్న సమారాధన జరుగుతుందని కొవ్వలి రజక సంఘం అధ్యక్షుడు గోవాడ నాగరాజు, సెక్రటరీ గోవాడ శ్రీనివాసరావు, క్యాషియర్ గొల్లపూడి రమేష్, శ్రీను జాయింట్ సెక్రటరీ గోవాడ దుర్గారావు అన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని బుధవారం జరిగే అన్న మహా సమారాదనలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు



ఆర్టీసీ బస్సులో విజయకేతనం చూపుతున్న పోలసానిపల్లి గురుకుల బాలికలు

భీమడోలు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు మంగళవారం సోషల్ పరీక్షతో ముగిసాయి. చివరి గంట మోగగానే బయటకు వచ్చి కేరింతలు కొడుతూ సందడి చేశారు. ఏడాదంతా చదువులతో ఉక్కిరిబిక్కిరి అయిన విద్యార్థులు పరీక్షలు ముగియడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. మండలంలోని ఏడు పరీక్షా కేంద్రాల్లో రెగ్యులర్, ప్రైవేటు 923 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 894 మంది పరీక్షలకు హజరయ్యారు. 29 మంది గైర్హజరయ్యారు. ఐదేళ్ల పాటు ఒకే చోట చదువుకున్న మనమంతా జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలని కోరుకుంటూ ఒకరినొకరు వీడ్కోలు పలికారు. భీమడోలు ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రంలో పోలసానిపల్లి, గుణ్ణంపల్లి, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు పరీక్షలు రాసారు. పోలసానిపల్లి, పూళ్ల, గుండుగొలను, ఆగడాలలంక, శ్రీచైతన్య పాఠశాలల్లో పరీక్షలు రాశారు. పోలసానిపల్లి గురుకుల బాలికలను పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు ఆర్టీసీ యాజమాన్యం వారికి బస్సులను ఏర్పాటు చేసింది. దీనితో పరీక్షలు ముగియడంతో వారంతా బస్సుల్లో కూర్చుని సందడి చేసారు. వారంతా విజయచిహ్నాన్ని చూపుతూ సంతోషం వ్యక్తం చేసారు. వారి కుటుంబ సభ్యులతో తన ఆనందాన్ని పంచుకున్నారు.

తహసీల్దార్‌గా రవికుమార్



రవికుమార్‌ను అభినందిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఉంగుటూరు తహసీల్దార్‌గా పాలపర్తి రవికుమార్ నియమితులయ్యాయరు. ఈయన ప్రస్తుతం రాష్ట్ర సచివాలయంలోని ఆరోగ్య, కుటుంబ సంక్షేమం విభాగంలో సెక్షన్ అధికారిగా పనిచేస్తున్నారు. బుధవారం ఉంగుటూరు తహసీల్ద్రార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు రవికుమార్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ ప్రాణచంద్రప్రసాద్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

మధుబాబు ఫౌండేషన్ సేవలు అభినందనీయం



గుండుగొలనులో పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

భీమడోలు: పేదల కోసం సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న మావులేటి మధుబాబు ఫౌండేషన్ సేవలు అభినందనీయమని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. గుండుగొలను ఫౌండేషన్ కార్యాలయంలో మంగళవారం 120 మంది పేదలకు బియ్యం, పండ్లు పంపిణీ చేశారు. అదే విధంగా ప్రతి నెల బియ్యం అందుకుంటూ మృతి చెందిన ఒక్కొక్క కుటుంబానికి రూ.5వేల చొప్పున ముగ్గురికి రూ.15వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమానికి ఫౌండేషన్ కార్యదర్శి కొండ వెంకట్రాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి మాట్లాడారు. గుండుగొలను పరిసర గ్రామాల్లోని పేదలు, బలహీన వర్గాల ప్రజలకు, కరోనా, వరదలు వంటి విపత్కర పరిస్థితుల్లో వారికి అండగా నిలిచిన ఫౌండేషన్ సేవలు వెలకట్టలేనివన్నారు. సంస్థ ప్రతినిధులైన మధుబాబు కుమార్లును ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శిరిబత్తిన కొండబాబు, ప్రతినిధులు గరికిపాటి కృష్ణమూర్తి, కొండ గంగరాజ్‌కుమార్, దాట్ల సీతారామరాజు, కాపల్లి కృష్ణంరాజు, నడింపల్లి వాసురాజు, కొనకళ్ల సతీష్ పాల్గొన్నారు.

13న విద్యార్థులతో చర్చావేదిక



పోటీల కార్యక్రమం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): జ్యోతిరావు పూలే, బీఆర్ అంబేడ్కర్‌ల జయంతిని పురస్కరించుకుని పూలే, అంబేడ్కర్ ఆలోచనా విధానంపై ఈ నెల 13న సర్ సీఆర్ రెడ్డి బీఈడీ కాలేజీలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు జరిగే విద్యార్థులతో చర్చా వేదిక నిర్వహించనున్నట్టు ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు తెలిపారు. ఈ మేరకు బ్రోచర్‌ను మంగళవారం స్థానిక అన్నే భవన్‌లో ఆయన విడుదల చేశారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, యూటీఎఫ్, మానవత, కేవీపీఎస్, బోంసెఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలో పాల్గొనే వారు ఈ నెల 10వ తేదీ సాయంత్రంలోగా సెల్ నెంబర్లు 94419 75257, 95150 27023, 94900 98559లో వాట్సాప్ ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు. 13న మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు గాయనీ గాయకులచే సావిత్రిబాయి పూలే అంబేడ్కర్ గురించిన ప్రబోధాత్మక సందేశాత్మక పాటలు కళా ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. విజేతలకు ప్రశంసా పత్రం, మెమెంటోతో సత్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దేవరకొండ వెంకటేశ్వర్లు, కార్యక్రమ కోకన్వీనర్లు జి.రాంబాబు జి.నీలిమ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, బాలోత్సవం కమిటీ ప్రతినిధులు కె.శ్రావణ కుమారి, కె.జనని, దేవరకొండ లలిత, ఎం సాయి సిద్ధార్థ, డి.విజ్ఞాన్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పరిశుభ్రతకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ప్రజలందరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్‌యూనిటు అధికారి వై.వీ.లక్ష్మణరావు పిలుపు నిచ్చారు. మంగళవారం కాగుపాడులో ఇంటింటికి తిరిగి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. లార్వా దశలోనే దోమను అంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కాగుపాడు ఆసుపత్రి సిబ్బంది సత్యనారాయణ, శ్రీనివాసరావు,అంగన్‌వాడీ కార్యకర్తలు రత్నకుమారి, విజయకుమారి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ మహోత్సవాలు



కొత్తపేటలో అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళలు

భీమడోలు: మండలంలోని పూళ్ల పంచాయతీ శివారు కొత్తపేట ఏరియాల్లో శ్రీకనకదుర్గ అమ్మవారి ఉగాది ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రెండోరోజు అమ్మవారి ఆలయం నుంచి పూళ్ల వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి పట్టు వస్త్రాలు, సారెను గ్రామస్తులు పెద్ద ఎత్తున మేళాతాళాలతో ఊరేగింపుగా తీసుకుని వెళ్లారు. అక్కడ నుంచి అమ్మవారి ఆలయానికి చీర, సారెను తీసుకుని వచ్చారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పూజారిని ఘనంగా సత్కరించారు. పెద్ద ఎత్తున మహిళలు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఆలయాన్ని విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిలుకూరి సుధాకర్, పెద్దలు యడ్లపల్లి ఏసుబాబు, పానే రాంబాబు, బందారు రాంబాబు, యడ్లపల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



రహదారిపై ఏర్పడిన గొయ్యి

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన లంకాలపల్లి నుంచి రేపల్లె వెళ్లే రహదారి మలుపు మధ్యలో పెద్ద గొయ్యి ఏర్పడింది. వర్షాలకు మలుపు సమీపంలో ఉన్న కల్వర్టుకు పెద్ద గొయ్యి ఏర్పడడంతో ప్రమాదకరంగా మారింది. రేపల్లె, రేగులపాడు, మోదేలు నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చే గిరిజనులు చూసుకోకుండా వాహనాలను నడిపితే ఆ గోతిలో పడే ప్రమాదం ఉంది. అలాగే పలువురు వ్యవసాయ రైతులు కూడా ఈ రహదారిపై ప్రయాణిస్తుంటారు. అధికారులు వెంటనే ఈ గొయ్యిని పూడ్చాలని గిరిజనులు కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



నాచుగుంటలో సీసీస రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు: గ్రామాలాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మారాజు అన్నారు. మంగళవారం ఉంగుటూరు మండలంలో పలు గ్రామాల్లో 1 కోటి 93 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మారాజు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయం కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధికి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పని చేస్తున్నారన్నారు. నల్లమాడులో రూ.5లక్షలతో వ్యయంతో నిర్మించిన సీసీ రహదారి, యర్రమల్లిపాడులో రూ.17.50 లక్షలు వ్యయంతో నిర్మించిన సీసీ రహదారిని, కంసాలిగుంటో రూ.13 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రహదారి, ఎ.గోకవరంలో రూ.13లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రహదారిని రహదార్లను ప్రారంభించారు. కూటమి నాయకులతో పాటు ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల జిల్లా కార్యవర్గం ఎంపిక

పెదవేగి : జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం ఏలూరు జిల్లా పెదవేగి మండలం వేగివాడలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ లంక రత్నాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులకు చట్ట సభలో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సాధికార కమిటీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు కొప్పెర్ల నాగరాజు మాట్లాడుతూ ఆదరణ పథకం దేవాలయాలకు కమిటీలు అందరికీ న్యాయం జరిగేలా చూడాలని కోరారు. జిల్లా కార్యవర్గంలో ఈరోజు కొంతమంది సభ్యులను కొప్పాక సత్యనారాయణని సెక్రెటరీగా బొండాడ నాగబాబుని, జిల్లా మీడియా కోఆర్డినేటర్‌గా మనోజ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. రాష్ట్ర సెక్రెటరీ కొప్పాక సత్యనారాయణ పాల్గొన్నారు.

నిర్వాసితుల త్యాగాలతోనే పోలవరం ప్రాజెక్ట్



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

పోలవరం రూరల్: వేల కుటుంబాల త్యాగాల ఫలితంగానే రాష్ట్రానికి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం సాకారమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పేర్కొన్నారు. మండలంలోని వేలేరుపాడు, సుద్దగుంపు, జగన్నాథపురం, మల్లారం, భూదేవిపేట, రామవరం, ఇప్పలగుంపు తదితర గ్రామాల్లో శత జయంతి వేడుకల్లో భాగంగా సీపీఐ చేపట్టిన ప్రచార జాత రెండో రోజు మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య నిర్వాసితులకు కుంటి సాకులు చూపించకుండా నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. ఆలస్యం చేయకుండా ముంపు గ్రామాలన్నిటినీ పునరావస ప్రాంతాలకు తరలించాలన్నారు. అనేక ఏళ్లుగా గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇచ్చి వారికి ప్రభుత్వ ఫలాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యుడు ఎండీ మునిర్, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కారం దారయ్య, వసంతరావు, సన్నేపల్లి సాయిబాబు, బాడిశ రాము, డి.శివకుమార్, కురిమల వెంకటేశ్వర్లు, పిట్టా వీరయ్య, తాటి దుర్గారావు, బంధం నాగేశ్వరావు, కంగాల గంగరాజు, భీమరాజు, సోడే ప్రసాద్, సోడే సత్తిబాబు, బంధం పెద్ద నాగేశ్వరావు, సోడే కన్నారావు, పాల్గొన్నారు.

బంతి బంతికీ బెట్టింగ్

- పల్లెలకూ పాకిన విష సంస్కృతి
- యువతే లక్ష్యంగా గ్రామాల్లో బుకీల ఏర్పాట్లు
- ఐపీఎల్ మ్యాచ్‌లకు చేతులు మారుతున్న నగదు



ఐపీఎల్ మ్యాచ్‌లో విజయం సాధించిన సంబరాల్లో టీమ్(ఫైల్)

పెదవేగి : ఓ ఐపీఎల్ మ్యాచ్‌కు నియోజకవర్గ వ్యాప్తంగా చేతులు మారుతున్న నగదు ఏడాది పాటు పది కుటుంబాల పోషణకు సరిపోతుంది. వినడానికి అతిశయోక్తిగా అనిపించినా దెందులూరు నియోజకవర్గంలో క్రికెట్ బెట్టింగుల జోరు ఈ స్థాయిలో ఉంది. మూడు గంటల సమయంలో కేవలం 20 ఓవర్ల వ్యవధిలో లక్షల్లో పట్టాణాలకే పరిమితమైన బెట్టింగ్ విష సంస్కృతి ఇప్పుడు గ్రామాల్లో సైతం భారీగా సాగుతోంది. సెల్‌ఫోన్ల ద్వారా నగదు రహిత లావాదేవీల రూపంలో యువకులు జూదానికి పాల్పడుతున్నారు. ఒక్కో మ్యాచ్‌కు, ఓవర్‌కు, ఇన్నింగ్స్ స్థాయిలో, క్రీడాకారుల వ్యక్తిగత పరుగులు, వికెట్లు, ఫోర్లు, సిక్సర్లు...ఇలా అవకాశం మేరకు క్రికెట్ బెట్టింగ్‌ల్లో పాల్గొంటున్నారు. ఒక్కో మ్యాచ్‌కు నియోజకవర్గ వ్యాప్తంగా రోజుకు కనీసం రూ.10 లక్షల మేర బెట్టింగ్‌లు సాగుతున్నట్టు అంచనా. ముఖ్యంగా కళాశాల యువత నుంచి గ్రామాల్లోని ఆటో డ్రైవర్ల వరకూ రూ. వెయ్యి నుంచి రూ. 50 వేల వరకూ జూదం జరుగుతోంది. బడా బాబుల బిడ్డలు లక్షల్లోనే పందేలు కాస్తున్నారు. నగదు రహితంగా కొందరకు ముందస్తుగానే మధ్యవర్తుల వద్ద నగదు బదిలీ చేసుకుని జూదంలో పాల్గొంటున్నారు.

పలు గ్రామాల్లో...

నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో బెట్టింగ్‌ల జోరు సాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో పోలీసుల పర్యవేక్షణ తక్కువగా ఉన్న ప్రాంతాలను ఎంచుకుని సెల్ ఫోన్ల ద్వారా బెట్టింగులు సాగిస్తున్నారు. నియోజకవర్గంలో దెందులూరు, కొవ్వలి, గోపన్నపాలెం, పెదవేగి, వేగివాడ, విజయరాయి, పెదపాడు, వట్లూరు, విజయరాయి, ముండూరు, తదితర గ్రామాల్లో బెట్టింగ్‌లు సాగుతున్నట్లు తెలిసింది. ఈ బెట్టింగ్‌ల్లో చాలా మంది నష్టపోయి ఆర్థికంగా కుదేలవుతున్నారు. ఇది ఆత్మహత్యలకు కూడా పాల్పడడానికి కారణమవుతోందని గ్రామాల్లోని పెద్దలు వ్యాఖ్యానిస్తున్నారు.



బెట్టింగ్‌లో చేతులు మారుతున్న నగదు

సాంకేతిక దన్నుతో...

గతంలో కన్నా సాంకేతిక పరిజ్ఞానంలో మార్పు రావడంతో బెట్టింగ్‌లు సులభంగా సాగుతున్నాయి. టీవీలు, సెల్‌ఫోన్లు, లాప్‌ట్యాప్‌ల ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

బెట్టింగ్‌లకు పాల్పడుతున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారన్న సమాచారం మేరకు రెండు పర్యాయాలు దాడులు చేశాం. కాని పెద్ద మొత్తంలో నిర్వహకులు దొరకలేదు. గ్రామాల్లో సెల్ ఫోన్‌ల ద్వారా, కోడి పందేల మాదిరిగా ఈ ఐపీఎల్‌లో కూడా బెట్టింగ్‌లు కడుతున్నారు. ఏ సమాచారం అందినా దాడులు చేస్తున్నాం.

– కె రామకృష్ణ, ఎస్సై పెదవేగి